క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం


ఆలయ అధికారులకు విరాళమిస్తున్న హుబ్లీ వాసులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు కర్ణాటకలోని హుబ్లీకి చెందిన జాహ్నవి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబుకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం

గుడిపాల: తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్, సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ (చిత్తూరు) ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మసముద్రం కెయంరెడ్డి జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, వైద్య శిబిరం నిర్వహించనున్నారు. 35 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు స్విమ్స్ పింక్ బస్సులో వైద్యపరీక్షలు చేయించుకో వచ్చని, ఇందుకోసం మహిళలు విధిగా ఆధార్ కార్డ్‌ను తేవాలని నిర్వాహకులు తెలిపారు. సుమారు 7వేల నుంచి రూ.10వేల వరకు వ్యయమయ్యే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారు. 15 మంది మహిళా డాక్టర్లు, 15 మంది వైద్యసిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి ట్రాన్స్‌కో సమావేశాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో 26 నుంచి 28 వరకు సబ్‌స్టేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. 26న ఆవులకొండ, వేపంజేరి, బలిజకండ్రిగ, మత్తంపల్లె, పెనుమూరు, ఉగ్రణంపల్లె, ఎం.బండపల్లె, పి.కొత్తకోట, ఎగువ పాలకూరు, కొత్తపల్లె, సీకేపల్లె, బీఎన్ఆర్‌పేట, దొడ్డిపల్లె, 27న జీడీనెల్లూరు, నందనూరు, పేటమిట్ట, పోలవరం, పాపసముద్రం, 197 రామాపురం, వెంగనపల్లె, తాళంబేడు, చెర్లోపల్లె, 28న ఎస్ఎస్‌కొండ, తానా, టీవీఎస్‌పురం, వీఆర్ కుప్పం, పూతలపట్టు, తలుపులపల్లె, అన్నుపల్లె, రెడ్డిగుంట, తుమ్మిందపాళ్యం ప్రాంతాల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్టు వివరించారు. వినియోగదారులు హాజరై సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

పూతలపట్టులో క్రికెట్ టోర్నీ


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

పూతలపట్టు: మండలంలోని మద్దులయ్యగారిపల్లెలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. పేట అగ్రహారానికి చెందిన రవి నాయుడు సౌజన్యంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్టు స్థానిక యువకులు తెలిపారు. వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రవి నాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. వివరాలు.. మండలంలోని మొగిలివెంకటగిరికి చెందిన విశ్వనాథ ఆచారి(67)ఈ నెల 21న చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి రాగిమాను పెంట రోడ్డు పక్కన నిలుచుకుని ఉండగా ఆండారెడ్డిపల్లె నుంచి బంగారుపాళెం వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వనాథ ఆచారి తీవ్రంగా గాయపడడంతో 108లో బంగారుపాళెంకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో తదుపరి చికిత్స నిమిత్తం తిరుపతితోని రమాదేవి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోజు

తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరులోని తమ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని, అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల నడుమ స్పందన నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్: 98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

అన్నదాతకు భరోసా


వసంతాపురంలోని రైతుభరోసా కేంద్రం


మల్టీ ఫంక్షన్ కియోస్క్‌లు

- నకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మట్టినే నమ్ముకున్న రైతాంగానికి తెలుగుదేశం తన హయాంలో మొండిచెయ్యి చూపి, అన్నదాతలను అథోగతి పాల్జేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేసి, రైతన్నలకు అన్ని విధాలా చేయూతనిస్తూండడంతో వ్యవసాయ రంగం బలోపేతమైంది. రైతు భరోసా పథకం కింద వ్యవసాయానికి పెట్టుబడి సాయం ఇవ్వడం, భూసార పరీక్షలు చేయడం, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు మొదలైనవి ఇవ్వడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతన్నల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గుడిపాల: మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు అవసరమైన సేవలన్నీ ప్రభుత్వం అందిస్తోంది. మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌ల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆర్‌బీకేల్లో సబ్సిడీపై విత్తనాలు ఇచ్చింది. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఆ రిపోర్టు ఆధారంగా ఏ పంటలు సాగు చేయవచ్చు, వాటికి వాడాల్సిన ఎరువులు.. ఇత్యాది వాటి గురించి సలహాలు–సూచనలు ఇస్తోంది. మండలంలో 17 కస్టమర్ హియరింగ్ సెంటర్లు ఉండగా, వాటి పరిధిలో వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద 8 ట్రాక్టర్లను అందజేశారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. పంట దిగుబడి పెరిగేలా వినూత్న సాగు విధానాలను ఆర్‌బీకే ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

గతంలో ఏది కావాలన్నా పట్టణాలకే..

గతంలో (వైఎస్సార్‌సీపీ అధికారంలో రాకముందు) ఎరువులు, పురుగు మందులు కావాలంటే పట్టణ ప్రాంతాలకు రైతులు పరుగులు తీయాల్సి వచ్చేది. ఎరువుల దుకాణాల్లో చెప్పిన రేటుకే కొనాల్సి వచ్చేంది. అంతేకాకుండా నకిలీ విత్తనాలు, పురుగు మందులతో తీవ్రంగా నష్టపోయే వారు కూడా. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లోనే ఆర్‌బీకేలతో అన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వం అందిస్తోంది.

మండలంలో ఆర్‌బీకేల సేవలు

ఆర్‌బీకేలు :	17
సిబ్బంది :	17
మల్టీ ఫంక్షన్ కియోస్క్‌లు :	17
సీహెచ్‌సీ గ్రూపులు :	17
వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద పంపిణీ చేసిన ట్రాక్టర్లు :	8
కౌలు రైతు కార్డులు :	36
రైతుభరోసా పొందిన రైతులు :	5,877
లబ్ధిపొందిన మొత్తం :	రూ.3.23కోట్లు

ఇబ్బందులు తొలగాయి



గతంలో పంటలకు తెగుళ్లు సోకితే ఆ మొక్కను తీసుకొని పట్టణంలోని ఎరువుల షాప్ వాళ్లకు చూపించే వాళ్లం. వాళ్లు ఇచ్చిన మందులను పంటలకు వాడే వాళ్లం. అవి పనిచేయకుంటే పంట నష్టపోయేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏ పంట సాగు చేసినా ఆర్‌బీకే సిబ్బంది వచ్చి పరిశీలించి ఏం చేయాలో చెబుతున్నారు.

– శ్రీరాములు, వసంతాపురం

ఆర్బీకేలతో సౌకర్యం



గ్రామాల్లోని ఆర్బీకేలతో ఎంతో సౌకర్యంగా ఉంది. సకాలంలో నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు పొందుతున్నాం. గతంలో (తెలుగుదేశం పార్టీ పాలనలో) విత్తనాలు కావాలంటే తెల్లవారుజామునే మండల కేంద్రానికి వెళ్లి క్యూలో నిలవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లు వాట్సాప్ ద్వారా మెసేజ్ పెట్టడంతో ఆ బాధలన్నీ తప్పాయి.

– రెడ్డెప్ప, గుడిపాల

అప్పుల బాధ తప్పింది



గతంలో వ్యవసాయానికి అప్పులు చేయాల్సిన వచ్చేది. ఇప్పుడు రైతుభరోసా పథకం కింద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేస్తున్న డబ్బులు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతోంది. ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే మా బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. నాలుగేళ్లుగా లబ్ధి పొందుతున్నా.

– గోవిందరెడ్డి, వసంతాపురం

వరసిద్ధుని సేవలో చంద్రగిరి ఎమ్మెల్యే


చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం


కుంభాభిషేకంలో ఓంశక్తి భక్తులు

గుడిపాల: మండలంలో 197రామాపురంలోని కల్లంమిట్ట వద్ద గల ఓం శక్తి అమ్మవారి దేవాలయంలో మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి సిద్ధుల పీఠం ఆధ్వర్యంలో పాలాభిషేకం, గోపుర కలశ స్థాపన, కలశ ప్రతిష్ఠ హోమం నిర్వహించారు. ఉదయం వేద పండితుల ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఓంశక్తి అమ్మవారి పటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సరిత, ఆర్ముగం రెడ్డి, నాగేంద్రన్, గిరిజ, నాగయ్య, వినాయకం, బాల తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు రాములుగుడి వీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులు వైద్యసేవలు అందించారు. శిబిరంలో 146 మందికి వైద్యపరీక్షలు చేసి 76 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సుభాష్‌జైన్, ప్రేమ్‌చంద్, విశాల్‌జైన్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడమే మానవత్వం


అనాథలకు కటింగ్ చేయిస్తున్న జేఏసీ సభ్యులు

బంగారుపాళెం: అనాథలకు సేవ చేయడమే మానవత్వమని సీఐ నాగరాజరావు అన్నారు. బంగారుపాళెం, తగ్గువారిపల్లె పంచాయతీలో నిరాదరణకు గురైన అనాథలకు ముస్లిం జేఏసీ సభ్యులు ఆదివారం కటింగ్, క్షురకర్మ చేయించి, కొత్తదుస్తులను అందజేశారు. సీఐ వారిని అభినందించారు. జేఏసీ అధ్యక్షుడు అన్ను, సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న సాయి విఘ్నేష్ (24) అనే వ్యక్తిని చిత్తూరు వన్ టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కయినికట్టు వీధికి చెందిన నిందితుడు సాయి విఘ్నేష్ , వంద కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు కలిగి ఉండడంతో అరెస్ట్ చేశారు.

అలరించిన 'దుర్యోధన వధ'


దుర్యోధన వధ ప్రదర్శనలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

ఐరాల: మండలంలోని పెద్దగొల్లపల్లెలో శ్రీదౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్ట ప్రదర్శన భక్తులను అలరించింది. తొలుత ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉషారాణి హరికథాగానం చేశారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు వెలికి తీసుకువచ్చి హతమార్చడం భారతగాథ. ఈ ఘట్టానికి సంబంధించి ఆలయ ఆవరణలో దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల యుద్ధ సన్నివేశాలు భక్తులను కట్టి పడేశాయి. పద్యాలు పాడుతూ, ఒకరిమీద ఒకరు రోషావేశాలతో కలియబడుతూ కళాకారులు ప్రదర్శనకు జనం చప్పట్లు, విజిల్స్‌తో హోరెత్తించారు. వధ ఘట్టం అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం నిర్వహించారు.


దుర్యోధన మట్టి రూపంపై పద్యాలు ఆలపిస్తున్న దుర్యోధన పాత్రధారి

చెన్నారెడ్డిపల్లెలో..

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలోని ద్రౌపదీ ధర్మరాజుల ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్ట ప్రదర్శన భక్తులను అలరించింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం నేలపై పొడవునా మట్టితో దుర్యోధన ప్రతిమను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు చేసి పాండవుల విగ్రహాలను అక్కడ కొలువుదీర్చారు. ఆ తర్వాత భీమ, దుర్యోధన పాత్రలు ధరించిన కళాకారులు తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. దుర్యోధన మట్టి రూపంలో తొడ వద్ద ఏర్పాటు చేసిన కుండను భీముడు తన గదతో పగులగొట్టి వధ ఘట్టాన్ని ముగించారు. ఆ తర్వాత అక్కడి మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు.

కుంభాభిషేక పూజలు పరిసమాప్తం


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తదితరులు

చిత్తూరు రూరల్: చిత్తూరు చర్చివీధిలోని శ్రీకృష్ణ విలాస సభ మహా కుంభాభిషేక పూజలు ఆదివారం పరిసమాప్తమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు సభలో విశేష పూజలు, మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. గోపుర కలశ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, చుడా చైర్మన్ పురుషోత్తం హాజరయ్యారు. వారికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు అందజేశారు. తర్వాత స్వామి తిరుకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

స్కూళ్లలో అధికారుల తనిఖీలు


పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న చేస్తున్న మునిసిపల్ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని పలు పాఠశాలలను మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ఇటీవల యాదమరి మండలంలో ఓ పాఠశాల వద్ద గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని నగరంలోని పాఠశాలల వద్ద పరిస్థితులను పరిశీలించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ సహాయ కమిషనర్ గోవర్దన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట ప్రసాద్, ఏసీపీ రామకృష్ణుడు, ఆర్ఓ గోపాలకృష్ణ వర్మ, సీఎంఎం గోపి, సచివాలయ కార్యదర్శులతో కలిసి నాలుగు బృందాలుగా నగరంలోని 40 పాఠశాలలను తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న నాడు–నేడు పనులను సైతం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడైనా ప్రమాదకర స్థితిలో గుంతలు ఉన్నాయా? నీటి సంపులపై మూతలు ఉన్నాయా? శిథిలావస్థలో ప్రహరీగోడలున్నాయా, ప్రమాదకరంగా ఏవైనా విద్యుత్ వైర్లున్నాయా? అనే అంశాలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవని గుర్తించారు.

సినిమాటోగ్రఫీలో రాజేష్‌కు బంగారు పతకం


దిల్‌రాజు చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న రాజేష్

చిత్తూరు రూరల్: డిప్లొమా ఇన్ సినిమాటోగ్రఫీ కోర్సులో చిత్తూరు మండలం గొల్లపల్లెకు చెందిన రాజేష్ బంగారు పతకం సాధించాడు. సినీ నిర్మాత దిల్ రాజు చైర్మన్‌గా హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న దాదాసాహెబ్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ సంస్థలో రాజేష్ 2020–21లో డిప్లొమా పూర్తిచేశాడు. 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రానికి అసోసియేట్‌గా పనిచేశాడు. కోర్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇతనికి గతవారంలో సంస్థ చైర్మన్ దిల్‌రాజు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు.

అడవిపల్లె రిజర్వాయర్‌ను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ సభ్యులు

చిత్తూరు రూరల్: అడవిపల్లె రిజర్వాయర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు నాగేందర్, సుందర్‌రెడ్డి కోరారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడవిపల్లె రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు పూర్తయితే చిత్తూరుకు పూర్తి స్థాయిలో నీటి సమస్య తీరుతుందన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో శివకుమార్, శ్రీదేవి, సురేష్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం..


క్లిక్..క్లిక్ : 35 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూలులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ 1987–1988లో పదవ తరగతి చదివిన వారు కాలక్రమంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 35 ఏళ్ల అనంతరం మళ్లీ కలిసి స్నేహమేరా జీవితం..అంటూ జ్ఞాపకాల పూదోటలో సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 70 మంది పూర్వ విద్యార్థులు కలిశారు.

రూ.10 లక్షల పరిహారం చెక్కుల పంపిణీ



పుంగనూరులో బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. పుంగనూరు మున్సిపాలిటీలోని నక్కబండలో పది రోజుల క్రితం ఆసిఫ్ అనే యువకుడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే శ్రీకాళహస్తి పట్టణంలో చాంద్‌బాషా అనే వ్యక్తి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పరిహారాన్ని మంజూరు చేసింది. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, ట్రాన్స్‌కో ఏఈఈ ధనుంజయమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చేతిరుమాళ్ల పంపిణీ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులకు పొన్నమాకులపల్లి మురళీకృష్ణ రూ.6 వేలు విలువజేసే చేతి రుమాళ్లను ఆదివారం పంపిణీ చేశారు. హాస్టల్‌లో చదువుకునే పేద పిల్లలకు చిరుసాయం చేయాలనే తలంపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. దాతను హాస్టల్ వార్డెన్‌ను సోమచంద్రారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ మునెప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ఇంటర్ క్లబ్ చెస్ టోర్నమెంట్


చెస్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఆదివారం గురుకులం ఇంటర్ క్లబ్ ప్రొఫెనల్ చెస్ టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగింది. హెచ్ఎం రుద్రాణి ఆధ్వర్యంలో విద్యార్థులు చెస్ పోటీల్లో పాల్గొన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు జూలై 2న చిత్తూరులో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. కాగా 14 మంది సభ్యులతో జరిగే టోర్నమెంట్‌కు పుంగనూరు జెడ్పీ హైస్కూల్ నుంచి ఏడుగురు ఎంపిక కావడం హర్షణీయమని కొనియాడారు. ఈ పోటీల పర్యవేక్షణలో పాఠశాల కమిటీ చైర్మన్ గోపి, ఉపాధ్యాయులు జ్యోతి, అన్నాదొరై, రాధిక, రెడ్డిరాజేశ్వరి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.